

అట్లతద్ది వేడుకలు

అత్తిలి: మండలంలో అట్లతద్ది పండుగను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాలువ వద్ద, చెరువు వద్ద గౌరీదేవీకి పూజలు నిర్వహించి, వాయినాలు సమర్పించారు.



కిటకిటలాడిన మద్ది

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.



వివాహిత దారుణ హత్య

పెనుగొండ శివారు అడ్డపుంత బోదే వద్ద వివాహిత హత్య కలకలం రేపింది. మృతదేహాన్ని పంటబోదేలో పడేసి హంతకులు పరారయ్యారు. 8లో

న్యూస్‌రీల్

పనులు వేగంగా పూర్తి చేయాలి



పనుల ప్రగతిపై సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): జెడ్పీ నిధులతో చేపట్టిన పనులను సత్వరమే పూర్తిచేయాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రగతిలో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, మొదలు పెట్టాల్సిన పనులను పరిశీలించి అవసరం అనుకున్నవి సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. అవసరం లేని పనులను గుర్తించి జాబితాలు తయారుచేసి పంపాలని అధికారులకు తెలిపామన్నారు.

ఉంగుటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: ఉంగుటూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వాసుబాబు మంగళవారం ప్రారంభించారు. సకాలంలో రైతులు ధాన్యాన్ని తరలించేందుకు ఉంగుటూరు మండలంలో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు వాసుబాబు వెల్లడించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం గతంలో ఎప్పుడూ జరగలేదని వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ పని చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఆర్బీకే చైర్మన్ తల్లాప్రగడ శివరామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, వ్యవసాయశాఖ జేడీ రామకృష్ణ, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేస్తాం



కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీఐజీ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేస్తానని ఏలూరు డీఐజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన ఎస్పీ మేరీ ప్రశాంతితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారికి ఎస్సై విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. తొలుత డీఐజీ, ఎస్పీలు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తిరిగి, పట్టుబడ్డ వాహనాలు, ఇసుక నిల్వలను పరిశీలించారు. స్టేషన్ విస్తీర్ణం, పోలీస్ స్టేషన్ చుట్టూ నిర్మించ తలపెట్టిన వ్యాపార సముదాయానికి గతంలో పోలీస్ ఉన్నతాధికారులు శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఐజీ ఆదేశించారు. స్టేషన్‌లో కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. కేసుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ పట్ల డీఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు.

పారదర్శకంగా ధాన్యం ఎగుమతులు

ఉంగుటూరు: జిల్లాలో 5.5 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తులు లక్ష్యంగా ఏర్పాట్లు చేశామని సివిల్ సప్లయిస్ డీఎంకే మంజుభార్గవి తెలిపారు. ఉంగుటూరు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 261 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామని తెలిపారు. 961 మందిని నియమించామని, 270 మంది శిక్షణ పొందిన వారిని నియమించామని తెలిపారు. జీపీఎస్ ట్యాగ్ విధానం ద్వారా వాహనాల ఏర్పాట్లు పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. కదలికలు జీపీఎస్ విధానంలో తెలిసిపోతుందని తెలిపారు. దీని వల్ల పారదర్శకంగా ఎగుమతులు జరుగుతాయని వివరించారు.

దిశ.. మహిళకు బ్రహ్మాస్త్రం

'ఏలూరు నగరంలో ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ఒక మహిళ తన పనిని ముగించుకుని రాత్రి 10.30గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా ఆకతాయిలు అల్లరిచేసే ప్రయత్నం చేశారు. వెంటనే ఆమె దిశ యాప్‌లో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కింది. తక్షణం స్పందించిన దిశ కంట్రోల్‌రూమ్ అధికారులు సమీపంలోని పోలీస్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆమెకు పోలీస్ సిబ్బంది రక్షణగా నిలిచారు.'

'ఏలూరు జాతీయ రహదారి కలపర్రు టోల్‌ప్లాజా వద్ద బస్సులో ప్రయాణిస్తున్న మహిళా అధికారిపై పోకిరి చేష్టలను 'దిశ' ఎస్‌ఓఎస్ యాప్ ఆటకట్టించింది. దిశ యాప్‌లో ఫిర్యాదు చేసిన క్షణాల్లోనే ఏలూరు త్రీటౌన్ కానిస్టేబుల్ 6 నిమిషాల్లో 6 కిలోమీటర్ల దూరంలోని సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజామున 4.21 నిమిషాల నుంచి 4.27 నిమిషాల వ్యవధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో హర్షం వ్యక్తమైంది.'

- ఏలూరు జిల్లాలో 14 లక్షలకు పైగా డౌన్‌లోడ్‌లు
- 9,52,428 దిశ యాప్ రిజిస్ట్రేషన్లు
- నిమిషాల వ్యవధిలో పోలీసులు స్పందన

సాక్షి ప్రతినిధి,ఏలూరు: బాధితులకు సత్వర భద్రత అందించే లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా జీరో ఎఫ్‌ఐఆర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా రక్షణకు తక్షణమే చర్యలు తీసుకునేలా జీరో ఎఫ్‌ఐఆర్‌ను తెరపైకితెచ్చారు. మహిళలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి తమ సమస్య చెప్పి న్యాయం కోరితే వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంది. తొలుత ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు కేసు బదిలీ చేసేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు.

దిశా యాప్‌తో భరోసా : మహిళలు, యువతులు ఆపదల్లో చిక్కుకుంటే పోలీసులతో పాటు కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సమాచారం తక్షణమే చేరవేసే ప్రత్యేక సౌకర్యం దిశా యాప్‌కు ఉండటం విశేషం. ప్రయాణ సమయంలో ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ ఉంటుంది. చేరాల్సిన గమ్యస్థానాన్ని నమోదు చేస్తే అనుక్షణం ట్రాకింగ్ చేస్తుంది. వాహనం దారి తప్పినా, ఆపదలో చిక్కుకున్నా తక్షణమే ఆ సమాచారాన్ని దిశ కంట్రోల్ రూంతో పాటు బంధుమిత్రులకు చేరవేస్తుంది. ప్రమాదం సంభవిస్తే అత్యవసర నెంబర్లు, పోలీస్‌స్టేషన్లు, సమీపంలోని హాస్పటల్స్, బ్లడ్‌బ్యాంకులు, ట్రామా కేర్‌లు, మెడికల్ షాపులు, మెటర్నిటీ హాస్పటల్స్ వివరాలు దిశాయాప్‌లో పొందుపరుస్తారు. ప్రతి మహిళ తమ ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన సమయంలో మాత్రమే నెట్ అవసరం. మిగిలిన సమయంలో నెట్‌తో పనిలేకుండానే ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే లేదా వేగంగా ఊపితే వెంటనే సమాచారం కంట్రోల్ రూంకు వెళ్తుంది.



దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసు సిబ్బంది(ఫైల్)

జిల్లాలో ఇలా
జిల్లాలో 14 లక్షలకుపైగా డౌన్‌లోడ్‌లు
9,52,428 దిశ యాప్ రిజిస్ట్రేషన్లు
ఎస్‌ఓఎస్‌కు వచ్చిన కాల్స్–3876
ఎఫ్ఐఆర్ – 350
పరిష్కారం చేసిన కేసులు– 296
పట్టణ ప్రాంతాల్లో రెస్పాన్స్ టైమ్ : 10 నిమిషాలు
గ్రామీణ ప్రాంతాలో రెస్పాన్స్ టైమ్ : 15 నిమిషాలు

రక్షణ కవచంలా దిశ యాప్



మహిళలు, యువతులు, బాలికలు ఆపద సమయంలో తమ సెల్‌ఫోన్లలోని దిశ యాప్‌ను వినియోగించాలి. దిశ యాప్‌పై జిల్లా వ్యాప్తంగా మహిళలు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మహిళ సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చైతన్యవంతుల్ని చేస్తున్నాం. కష్టకాలంలో దిశ యాప్‌లను ఎస్‌ఓఎస్ బటన్ నొక్కిన నిమిషాల్లోనే బాధిత మహిళలకు అండగా పోలీస్ సిబ్బంది చేరుకునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాం.

– డి.మేరీ ప్రశాంతి, జిల్లా ఎస్పీ

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో సత్వర న్యాయం



మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. ఈ నేపథ్యంలో దిశ యాప్‌తో రక్షణ కల్పిస్తుండగా బాధిత మహిళలకు సత్వర న్యాయం కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలోనూ మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల యాసిడ్ దాడి కేసులో ముగ్గురికి యావజ్జీవ ఖైదు శిక్ష విధించడం గొప్ప విషయం.

– ప్రత్తిపాటి తంబి, న్యాయవాది, ఏలూరు

మహిళల రక్షణకు ప్రాధాన్యత



సమాజంలో మహిళలకు భద్రత కల్పించేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావడం అభినందనీయం. ముఖ్యంగా దిశ యాప్ ద్వారా ఆపదలోని మహిళలకు పోలీసులు అండగా నిలబడేలా చర్యలు తీసుకోవడం ద్వారా మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది. మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవనే సంకేతాన్ని ఇచ్చేలా ఏలూరులో యాసిడ్‌దాడి కేసులో నిందితులకు జీవితఖైదు విధించడం, మహిళలకు ధైర్యాన్నిస్తోంది.

– టి.స్వాతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏలూరు

ఓటరు దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి

జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి



ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న జేసీ, అధికారులు

ఏలూరు(మెట్రో): ఎన్నికల కమిషన్ ఈఆర్‌ఓ నెట్ అందుబాటులోకి వచ్చిందని వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తయిన దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ –2024పై ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్ అనంతరం జేసీ ఈఆర్‌ఓలకు సూచనలిస్తూ ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ –2024 సంబంధించి ఈ నెల 24 న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామని, ఎన్నికల కమిషన్ ఈఆర్‌ఓ నెట్ ముగిసే నాటికి పెండింగ్ దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తయినవి త్వరగా అప్‌లోడ్ చేయాలని అన్నారు. విధుల్లో అలసత్వం లేకుండా చూడాలని అన్నారు. తొలగింపులకు సంబంధించి తప్పనిసరిగా రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీస్ ఇవ్వాలని, తిరిగి వచ్చిన వాటిని 15 రోజుల తరువాత బీఎల్‌ఓలు సంబంధిత అడ్రస్‌కు వెళ్లి పూర్తి వివరాలతో ఫైల్ రూపొందించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో సుబ్బారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జీ, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆరుగురు నిట్ విద్యార్థులకు తీవ్ర గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- బాధితులకు డిప్యూటీ సీఎం పరామర్శ

తాడేపల్లిగూడెం, రూరల్, అర్బన్ : ఏపీ నిట్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా.. ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో పెదతాడేపల్లి కమ్మ కల్యాణమండపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌కు రెండు సంవత్సరాల క్రితమే వివాహమైనట్టుగా తెలుస్తుంది. ఈశ్వర్ అనే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న నవీన్‌కు తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. మిగతా నలుగురికి తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం వారికి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్‌తో కలిపి ఐదుగురు మాత్రమే ప్రయాణించే కారులో ఏడుగురు ఎక్కారని పోలీసులు చెబుతున్నారు. విద్యార్థులు రెస్టారెంట్‌కు భోజనానికి వెళుతుండగా ఈ ఘటన జరిగిందని చెబుతుండగా, పుట్టినరోజు వేడుకకు వెళుతున్న సందర్భంగా ఈ ప్రమాదం జరిగిందని మరికొందరు చెబుతున్నారు. ఘటనా స్థలానికి తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులతో పాటు నిట్‌కు చెందిన వైద్యుడు, చీఫ్ వార్డెన్ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



గాయపడిన విద్యార్థులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ప్రమాదంలో గాయపడిన విష్ణువర్ధన్, ఈశ్వర్, జగతా శ్రీనివాసు



డ్రైవర్ ఆదిత్య మృతదేహం

గాయపడిన గాజులపాటి హర్షవర్ధన్, సాత్విక్

బాధితులను పరామర్శించిన డిప్యూటీ సీఎం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌తో కలిసి విద్యార్థులను పరామర్శించారు. అవసరమైతే ప్రభుత్వం నుంచి వైద్యసాయం అందిస్తామన్నారు. సంఘటన దురదృష్టకరం అన్నారు. విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తామన్నారు.

బస్సు యాత్ర సూపర్ సక్సెస్

దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో సోమవరప్పాడు- గోపన్నపాలెం వరకు జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సూపర్ సక్సెస్ అయిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్ర విజయవంతం చేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానం, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించడం ఎన్నటికీ మరువలేనన్నారు. దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కొఠారు అడ్డగా నియోజకవర్గ ప్రజలు నిరూపించారని, వచ్చే ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడటం తథ్యమన్నారు. పార్టీలోని అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో వారం రోజులుగా శ్రమించి ఎన్నడూ లేని విధంగా బస్సు యాత్రను విజయవంతం చేశారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో బస్సు యాత్ర చిరస్థాయిగా నిలిచిపోయేలా విజయవంతమైందన్నారు. ప్రజాప్రతినిధులు, స్నేహితులు, నాయకులు ఫోన్లు, మెసేజ్‌లు చేసి అభినందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం పెద్ద పీట వేశారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ద్వారా నాలుగున్నరేళ్లలో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తున్నారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రతి ఎమ్మెల్యేను ప్రజల వద్దకే పంపుతున్న ప్రజానేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.

నవోదయలో 9, 11 తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి: నవోదయలో 9, 11 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ వై.చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ ద్వారా తొమ్మిది, పదకొండు తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించే తేదీని ఈనెల 7 వరకు పొడిగించామన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా గడువు లోగా ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బిల్లులపై చర్యలు చేపట్టాలి

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): పోలవరం ప్రాజెక్ట్ సహాయ పునరావాసం(ఆర్‌అండ్‌ఆర్) కింద నిర్వాసితుల పెండింగ్ బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి వివిధ అంశాలపై పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, ఇతర సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించి తక్షణ పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి ఐటీడీఏ పీవో, జంగారెడ్డిగూడెం ఆర్డీఓల వద్ద నున్న బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని అదే విధంగా ఆప్షన్–2, 3 కింద ఉన్న బిల్లులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కింద 41.5 కాంటూరుకు సంబంధించి 25 గ్రామాలకు చెందిన స్ట్రక్చర్ల నిర్మాణాల పరిహారానికి సంబంధించిన రూ.13 కోట్ల బిల్లుల చెల్లింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. 45.16 కాంటూరుకు సంబంధించి 16 గ్రామాలకు గాను మిగిలిన 5 గ్రామాల్లో ఎన్యుమరేషన్ వచ్చేవారంలోపు పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ఏలూరు (టూటౌన్): అక్టోబరు నెల పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. అక్టోబరు నెల పింఛన్లకు సంబంధించి మొత్తం 17 విభాగాలకు 2,79,372 మందికి రూ.77.52 కోట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మొత్తం పింఛన్లలో 1,43,617 మందికి వృద్ధాప్య పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. వితంతు మహిళలు 69,046 మందికి, ఒంటరి మహిళలు 8,675 మందికి, దివ్యాంగులు 34,488 మందికి పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

తణుకు చోరీ ఛేదించిన పోలీసులు

- రూ.5.30 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- మహారాష్ట్రలో దొంగలను అరెస్టు చేసిన పోలీసులు
- 40 రోజులు మహారాష్ట్రలోనే మకాం

తణుకు అర్బన్: తణుకులో సెప్టెంబరు 12న జరిగిన భారీ చోరీని తాడేపల్లిగూడెం డివిజన్ పోలీసులు ఛేదించారు. తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను ఎస్పీ రవిప్రకాశ్ వెల్లడించారు. 40 సంవత్సరాల క్రితం మహారాష్ట్ర నుంచి తణుకులో స్థిరపడ్డ రేణుకా జ్యూయలరీస్ యజమాని నాందేవ్ దేవ్కర్ ఇంట్లో సెప్టెంబరు 12 రాత్రి మహారాష్ట్ర నుంచి వచ్చిన అంతర్రాష్ట్ర దొంగలు పెద్ద ఎత్తున ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడి ఇంట్లోకి ప్రవేశించి దేవ్కర్‌తోపాటు భార్య, పిల్లలపై దాడిచేసి తాళ్లతో కట్టి లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని పరారయ్యారు. ఈ చోరీలో దేవ్కర్ వద్ద పనిచేస్తూ పై అంతస్తు గదిలో ఉంటున్న మహారాష్ట్ర విటా పట్టణం కుర్లికి చెందిన సూరజ్ కుంభార్ కూడా ఉండడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. తణుకు డివిజన్ పరిధి పోలీసు యంత్రాంగం మూడు బృందాలుగా విడిపోయి మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లాలో దర్యాప్తు చేపట్టారు. భాష తెలియని రాష్ట్రంలో 40 రోజుల పాటు శ్రమించిన పోలీసు యంత్రాంగం ఏకంగా రూ. 5.30 కోట్ల విలువైన 8 కేజీల 816 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో పోలీసు యంత్రాంగం చూపిన చొరవ, పోరాటపటిమ ఎంతో సాహసమని ఎస్పీ ప్రశంసించారు. ఈ ఘటనలో ప్రధాన సూత్రధారి మహారాష్ట్రకు చెందిన నితిన్ పాండురంగ జాదవ్ అలియాస్ బాక్సర్, అలియాస్ దాదాగా పిలిచే వ్యక్తిపై ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు బందిపోటు నేరాలు, రెండు హత్యా యత్నం కేసులతోపాటు మొత్తం 11 నేరాలు ఉన్నట్లు చెప్పారు. ప్రధాన సూత్రధారి నితిన్ జాదవ్‌ను అతని అనుచరుడు ఓంకార్ జాదవ్‌తోపాటు అమిత్ సందీప్ పాటిల్, సూరజ్ కుంభార్, కైలాష్ శిల్కే, ఎస్‌కే సాధిక్‌లను విడివిడిగా అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.



చోరీని ఛేదించిన పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందించిన ఎస్పీ రవిప్రకాష్

స్థానిక పోలీసుల సహకారంతో..


దేవ్కర్ ఇచ్చిన సమాచారంతోపాటు దర్యాప్తులో భాగంగా దుండగుల కదలికలు మహారాష్ట్రలో ఉన్నట్లుగా నిర్ధారించుకున్న పోలీసు అధికారులు 40 రోజులపాటు అక్కడే ఉండి అక్కడి పోలీసుల సాయంతో మూడు బృందాలుగా విడిపోయి దర్యాప్తు ప్రారంభించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. బందిపోటు దొంగగా మారిన నితిన్ జాదవ్ మహారాష్ట్రలోనే ఉంటూ దేశవ్యాప్తంగా బంగారం కరిగించే యువకులను మంచి చేసుకుని వారి ద్వారా ఈ నేరాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు.

పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు ప్రశంసలు

చోరీ ఘటనను ఛేధించడంలో తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని డీఎస్పీ సి.శరత్ రాజ్‌కుమార్, తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు, ఎస్సైలు సీహెచ్ వెంకటేశ్వరరావు, డి.ఆదినారాయణ, కె.చంద్రశేఖర్, కె.సుధాకర్‌రెడ్డి, ఏఎస్సై ఎస్.శ్రీధర్, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు, రివార్డుగా నగదు పారితోషకాన్ని ఎస్పీ రవిప్రకాష్ అందచేశారు. మహారాష్ట్రలో ఎంతో సహకారం అందించిన ఇద్దరు కానిస్టేబుళ్లను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం, నగదు పారితోషికం అందచేశారు.

చింతమనేని ఓవరాక్షన్

పోలీస్‌స్టేషన్‌లో స్వీట్లు పంచుతూ హడావుడి



చింతమనేనిని బయటకు పంపుతున్న సీఐ

ఏలూరు టౌన్: టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి తన పైత్యాన్ని ప్రదర్శించారు. చంద్రబాబుకు వైద్య చికిత్స నిమిత్తం న్యాయస్థానం మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా దాన్ని చింతమనేని హడావిడి చేసే ప్రయత్నం చేశారు. ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన చింతమనేని సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ లోగా సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ స్టేషన్‌లో హడావిడి చేస్తున్న చింతమనేనిని బయటకు గెంటుకుంటూ వచ్చి గేటు బయటకు పంపివేశారు. పోలీస్‌స్టేషన్‌కు కూడా వెళ్లి చింతమనేని సిబ్బందికి స్వీట్లు పంచడం సరైన విధానం కాదంటూ పలువురు పోలీస్ అధికారులు అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బందిని కావాలని ఇరుకునపెట్టేలా ఇలాంటి చీప్ ట్రిక్స్ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



వివాహిత దారుణ హత్య


నందిని మృతదేహం

పెనుగొండ: పెనుగొండ శివారు అడ్డపుంత బోదే వద్ద వివాహిత హత్యకు గురైంది. హత్యచేసి పంట బోదేలో పాడేసి హంతకులు పరారయ్యారు. వివరాల్లోకి వెళితే మంగళవారం ఉదయం అడ్డపుంతలో గుత్తుల చిన సత్యనారాయణ కౌలు చేస్తున్న పంట బోదేలో ఓ మహిళ మృతదేహం ఉందని గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. 25 ఏళ్ల వయస్సు ఉంటుందని భావించిన మహిళ శవం బోర్లా పడి పంటబోదేలో తేలుతూ ఉండడంతో సంచలనంగా మారింది. మహిళ వీపుపైనా, ఎడమ భుజంపైనా, చాతిపైన పదునైన ఆయుధంతో పొడిచిన గాయాలు ఉన్నాయి. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ కె.రవిమనోహరచారి, సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ పరిశీలించి, వీఆర్వో ప్రసాద్ ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేశారు. ఎస్పీ యు.రవిప్రకాష్ హుటాహుటిన పెనుగొండ చేరుకుని సంఘటన ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అయితే సాయంత్రానికి మృతురాలు చివటం నందినిగా గుర్తించారు. పోలీసుల అదుపులో ఆమె భర్త చివటం రాంప్రసాద్ ఉన్నట్లుగా విశ్వసనీయ సమాచారం. దొంగరావిపాలెంకు చెందిన పితాని నందినిను చివటం రాంప్రసాద్ 2019లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 18 నెలలు కుమారుడు సైతం ఉన్నాడు. చివటం రాంప్రసాద్ హత్య చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు విచార ణ జరుపుతున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

పూత నిలిస్తేనే లాభాలు సాధ్యం


మెట్ట ప్రాంతంలో పూత దశలో ఉన్న జీడి మామిడి తోట


జీడి తోటలో చెట్లకు టి దోమ సోకిన దృశ్యం

- పూతదశలో జీడి మామిడి
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న అధికారులు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో జీడితోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం జీడి తోటలు పూత దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జీడిమామిడి రైతులు పూత దశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.దుర్గేష్ రైతులకు సూచనలు అందజేశారు. సాధారణంగా జీడిమిమిడిలో పూత అక్టోబర్, నవంబర్ నెలల్లో మొదలై జనవరి, ఫిబ్రవరి వరకు వస్తుంది. జీడిచెట్టుకు వచ్చిన పూతలో సుమారు 200 నుండి 800 వరకు పూలు పూస్తాయి. జీడిమామిడి చెట్లు పరాగ సంపర్కం వల్ల ఫలదీకరణ చెందుతాయి.

జీడిమామిడి చెట్లు పూతకు రావాలంటే సుమారు 25 రోజుల నుండి 30 రోజులు పొడి వాతావరణం ఉండాలి. ఒకవేళ అక్టోబర్ నుంచి నవంబర్ వరకూ వర్షాలు పడితే పూత ఆలస్యమై రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే తెగుళ్ల తీవ్రత కూడా ఎకువయ్యే అవకాశాలు ఎక్కువ. జీడిమామిడి అంట్లు నాటిన రెండో సంవత్సరం నుంచే పూత వస్తుంది. ఆ పూతను రైతులు తుంచేసి చెట్ల కొమ్మలు పెరగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనివల్ల చెట్లు బలంగా పెరిగి ఎక్కువ దిగుబడిని ఇస్తాయి. వర్షా కాలంలో సిఫార్సు చేసిన ఎరువులు రెండు నుంచి మూడు సమ భాగాలుగా వేసుకోవాలి. ఐదు సంవత్సరాలు పైబడిన చెట్టుకు యూరియా 1.5 కేజీలు, సూపర్ ఫాస్ఫేట్ 650 గ్రాములు,పొటాష్ 1 కేజీ వేసుకోవాలి. పూత దశలో మంచు ఎక్కువగా పడుతున్నప్పుడు పూత లోపల తేమ చేరి ఎండిన మగపూల వల్ల తామర పురుగులు లేదా తేయాకు దోమ ఉధృతి ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి.

పూత రక్షణ ఇలా

జీడిమామిడిలో టి-దోమ పూత దశ అంటే అక్టోబర్ , నవంబర్ నెలలో మొదలవుతుంది. జనవరిలో ఎక్కువై లేత చిగుళ్ల , పూత, పూత కాడలను, చిన్న కాయలను ఆశించి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. రసం పీల్చినప్పుడు ఒక రకమైన పదార్థం వదలడం వల్ల కాయలపై ,చిగుర్లపై గజ్జిలాంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా పూత, చిగుళ్లపె చేసిన రంధ్రాల వల్ల ఫ్లవర్ బ్లైట్ అనే తెగులుకూడ వ్యాప్తి చెందుతుంది. దోమ నివారణకు పూత మొదలై పువ్వు విచ్చుకోక ముందు ఒక సారి, పూలు ఫలదీకరణ చెందిన తరువాత రెండో సారి, టి దోమ ఉధతి ఎక్కువగా ఉన్నప్పుడు(కాయ గోలీ సైజులో ఉన్నప్పుడు) మూడో సారి పిచికారీ చేయాలి. చెట్లు చిగురించినప్పుడు మొదటి పిచికారీ కి రైతులు ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లీటరు నీటికి, లేదా అసిటామాప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే పూత కొమ్మలు కనిపించినప్పుడు రెండు, మూడు వారాల తరువాత ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీ లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ, లీటర్ నీటికి కలిపి రెండో సారి పిచికారీ చేయాలి. కాయలు గోలీ సైజులో ఉన్నప్పుడు ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ, లీటర్ నీటికి కలిపి మూడో సారి పిచికారీ చేయాలి. వీటితో పాటు వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడటం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

బూడిద తెగులు

పొడి వాతావరణం ఉన్నప్పుడు బూడిద తెగులు కూడ ఎక్కువగా పూతను నష్ట పరిచి పూత రాలిపోయేలా చేస్తుంది. బూడిద తెగులు వల్ల లేత చిగుళ్ల పూతను ఆశించి ఎండిపోయేలా చేసి పంటను నష్ట పరుస్తుంది. దీని నివారణకు సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. లేదా ట్రిడేమోర్ఫ్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకు, పూత, కాయమచ్చ తెగులు నివారణ

ఆకులపై చిన్న, చిన్న లేత ఆకుపచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపీ మచ్చలు పెరుగుతూ మచ్చ మధ్య ఎండిపోయి చివరికి మొత్తం ఆకు ఎండి రాలిపోతుంది. పూత, పూత కాడలపై మచ్చలు వచ్చి పూత ఎండిపోయి రాలిపోతుంది. దీని నివారణకు రైతులు తొలుత తెగులు ఆశించిన కొమ్మలు తొలగించుకోవాలి. మంకోజెబ్ 1 గ్రాము లీటరు నీటికి, లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి, లేదా క్లోరోతాలోనిల్ 1 మిలీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.


ఎ.దుర్గేష్, అసిస్టెంట్ డైరెక్టర్ , ఉద్యానవన శాఖ

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

ఆగిరిపల్లి: కడుపు నొప్పి తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆగిరిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నంద్యాల రంగమ్మకు కొడుకు, కూతురు ఉన్నారు. నంద్యాల భవానీశంకర్ (18)కు కొన్ని రోజులుగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం తల్లి వంట పని మీద తోటపల్లికి వెళ్లగా మధ్యాహ్న సమయంలో భవానీశంకర్ కు విపరీతమైన కడుపులో నొప్పి రావడంతో నొప్పి తట్టుకోలేక ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గుర్తించి చికిత్స కోసం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు ఏఎస్సై తావిరియా నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళ అరెస్ట్


పట్టుకున్న అక్రమ మద్యం బాటిల్స్‌ను చూపిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం దిబ్బగూడెంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి. చంద్రశేఖర్ తెలిపారు. తమకు అందిన కచ్చితమైన సమాచారంతో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, పోలవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాలతో సీఐ బి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దిబ్బగూడెం, రాచన్నగూడెం శివారులో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో సుమతి అనే మహిళ వద్ద నుంచి 170 తెలంగాణ మద్యం (క్వాటర్ బాటిల్స్) స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నూజివీడు ప్రభుత్వాస్పత్రిలో మోకాలు కీలు మార్పిడి శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స చేయించుకున్న చోడగిరి మాణిక్యాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మోకాలు కీలు మార్పిడి శస్త్రచికిత్స మంగళవారం ఉచితంగా చేశారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ ఆధ్వర్యంలో తొలిసారి నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో మోకాలు కీలు మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. లింగపాలెం మండలం పాశ్వానగర్‌కు చెందిన చోడగిరి మాణిక్యం(55) గత ఐదారేళ్లుగా రెండు మోకాళ్లు అరిగిపోవడంతో తీవ్ర నొప్పితో బాధపడుతోంది. పలు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరిగితే నాలుగు లక్షలకు పైగానే ఖర్చవుతుందని చెప్పారు. దీంతో ఏమి చేయాలో తెలియక తెలిసిన వారి సలహా మేరకు ఆర్థో వైద్యులు ఏవీఆర్ మోహన్ వద్దకు వచ్చారు. దీంతో ఆయన మోకాలు కీలు శస్త్ర చికిత్స నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ శస్త్రచికిత్సకు ఏలూరులోని గుప్తా ఫౌండేషన్ ఆర్థిక సహకారాన్ని అందించింది.

రోగిని పరామర్శించిన ఎమ్మెల్యే

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తొలిసారి విజయవంతంగా మోకాలు కీలు మార్పిడి శస్త్రచికిత్స చేసిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆసుపత్రికి వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్న మాణిక్యం తో మాట్లాడారు. అనంతరం శస్త్రచికిత్స చేసిన వైద్యులు ఏవీఆర్ మోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ నరేంద్రసింగ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఆసుపత్రికి రాష్ట్ర ప్రభుత్వం 23 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించిందని వివరించారు. ఎమ్మెల్యే ప్రతాప్ వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, వ్యవసాయ సలహా మండలి నియోజకవర్గ చైర్మన్ పల్లె రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

పోలియో వ్యాధిగ్రస్తులకు కృత్రిమ అవయవాల అందజేత


పోలియో వ్యాధిగ్రస్తులకు కృత్రిమ అవయవాలు అందజేస్తున్న పారిశ్రామికవేత్త మదుపల్లి మోహన గుప్త

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవార పోలియో వ్యాధిగ్రస్తులకు కృత్రిమ అవయవాలను అందించారు. ఈ సందర్భంగా గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ మదుపల్లి మోహన గుప్త మాట్లాడుతూ గుప్తా ఫౌండేషన్ ద్వారా ఈ ఏడాది రూ. 55 లక్షలకు పైగా విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏలూరు కేంద్రంగా కేశ ఎగుమతల వ్యాపారం నిర్వహిస్తున్న తమ సంస్థ 1989వ సంవత్సరంలో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ ప్రారంభించామన్నారు. మూడు దశాబ్దాలకు పైగా సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ద్వారకా తిరుమల విర్డ్ ఆసుపత్రి నిర్ధారించిన పోలియో వ్యాధిగ్రస్తులకు, అంగవైకల్యం కలవారికి రూ. 10 లక్షల విలువైన కృత్రిమ అవయవాలు అందజేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఆడిటర్ డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్ట్

టి.నరసాపురం: చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని వల్లంపట్ల, కృష్ణాపురం గ్రామాల్లో దాడులు చేసి వల్లంపట్ల గ్రామానికి చెందిన పలగాని నాగేశ్వరరావు, నామవరం గ్రామానికి చెందిన ముదు బాలకృష్ణలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 12 లీటర్ల నాటు సారా, ఒక మోటార్ సైకిల్‌ను సీజ్ చేశామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. అలాగే చింతలపూడి మండలంలోని తెలేసోమవరం గ్రామానికీ చెందిన గుడ్డేటి వెంకటేశ్వర రావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారా, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

ఏలూరు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఏలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం నగర శివారు చాటపర్రు యాదవులపేటకు చెందిన బలుసు వినోద్ ఏలూరు పాతబస్టాండ్ సెంటరులోని ఓ ప్రాంతంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్సై శుభశేఖర్ మంగళవారం తమ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వినోద్‌ను అరెస్ట్ చేశారు.

17 మద్యం సీసాలు స్వాధీనం

కలిదిండి: మండలంలోని కొరుకొల్లులో మేడిశెట్టి బాలసుబ్రమణ్యం అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో మంగళవారం అదుపులోకి తీసుకునట్లు ఎస్సై ప్రియ కుమార్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రీ ఆడిట్‌తో త్వరితగతిన బిల్లుల మంజూరు


చిన్నపరెడ్డి

సాక్షి, భీమవరం: మున్సిపాల్టీలు, దేవదాయశాఖలో ప్రీ ఆడిట్ కారణంగా బిల్లులు సక్రమంగా ఆన్‌లైన్ చేస్తే పనులకు సంబంధించిన బిల్లులకు ఆడిట్ అధికారులు వెంటనే ఆమోదించే అవకాశం ఉంటుందని ఆడిట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.చిన్నపరెడ్డి చెప్పారు. మంగళవారం భీమవరం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల్లో ప్రస్తుతం ప్రీ ఆడిట్ జరుగుతున్నందున ఆడిట్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో పనులకు సంబంధించి ఏ విధంగా రికార్డులు తయారు చేయాలి? అనే విషయాలపై ఇంజినీరింగ్ అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పనులకు సంబంధించి రికార్డులను సకాలంలో తయారుచేయకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నట్లు అధికారులు తెలపడంతో వారికి పూర్తిస్థాయిలో వివరిస్తున్నట్లు చెప్పారు. గతంలో ప్రతి ఏటా ఒకసారి మాత్రమే ఆడిట్ చేయడం వల్ల అనేక ఇబ్బందులుండేవని పనులకు సంబంధించిన రికార్డులు సరిగ్గా లేకపోవడంతో అభ్యంతరాలు నమోదు చేయాల్సి వచ్చేదని చిన్నపరెడ్డి వివరించారు. ప్రీ ఆడిట్ విధానం గ్రామ పంచాయతీలు, యూనివర్శిటీల్లో కూడా ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.